అభివృద్ధికి ఆటంకం

- 'గడప గడప'కూ మన ప్రభుత్వం పనులు రద్దు
- ప్రభుత్వం రద్దు చేసిన 135 పనులు పూర్తయినచోట బిల్లుల చెల్లింపులో జాప్యం
- అభివృద్ధి పనులకు ప్రతి సచివాలయానికి రూ.20 లక్షల నిధులు
- రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ నిర్మాణాలకు జగన్ సర్కార్ కృషి
- జగన్‌పై కసితో అభివృద్ధికి చేటు
- బకాయి విడుదలలోనూ జాప్యం


రాయదుర్గం పట్టణంలోని శాంతినగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వంలో పూర్తయిన సీసీ రోడ్డు


అయతపల్లిలో నిర్మించిన డ్రైనేజీ

రాయదుర్గం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పల్లె, పట్టణాల్లో 'గడప గడప'కూ మన ప్రభుత్వం పనుల్లో ఒకడుగు ముందుకు, రెండు అడుగులు వెనక్కి అన్నట్టుగా ఎనిమిది నెలలుగా సాగాయి. తాజాగా గురువారం కూటమి సర్కారు తీసుకున్న నిర్ణయంతో జాబితా నుంచి ఆ పేరు తొలగిపోయింది. ఫలితంగా ఆ పెండింగ్ పనులన్నీ రద్దయ్యాయి. మొత్తం 135 పనులు రద్దు చేశారు. పూర్తయిన బిల్లుల చెల్లింపులోనూ జాప్యం జరిగింది.

బిల్లుల చెల్లింపులోనూ జాప్యం ..

ప్రతిపాదిత పనుల్లో 80 శాతం గత వైఎస్సార్‌సీపీ హయాంలోనే పూర్తి చేశారు. ఆ తర్వాత అధికారం చేపట్టిన కూటమి సర్కార్ మరో 20 శాతం పనులు ఎటూతేల్చక నాన్చుడు ధోరణి అవలంబిస్తూ వచ్చింది. దీంతో పట్టణ, గ్రామాల్లో అభివృద్ధి ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్టు తయారైంది. ఎన్నికల చివర్లో చేపట్టిన 30 శాతం పనులకు బిల్లుల చెల్లింపులోనూ జాప్యం కనిపిస్తోంది. కాసుల కోసం కాంట్రాక్టర్లు కార్యాలయాల చుట్టూ చక్కర్లు కొట్టేందుకే సరిపెట్టారు. గడప గడపలో ప్రజా సమస్యలు తెలుసుకుంటూ.. ఆ గ్రామంలో అవసరమయ్యే పనులు గుర్తిస్తూ వాటి పరిష్కారానికి ఎమ్మెల్యేలు చిత్తశుద్ధితో కృషి చేసేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సత్వర నిధుల విడుదలకు శ్రీకారం చుట్టారు. వార్డు/ గ్రామ సచివాలయాలకు రూ.20 లక్షలు చొప్పున రాయదుర్గం నియోజకవర్గంలోని అర్బన్ సహా ఐదు మండలాల్లో 96 గ్రామ, వార్డు సచివాలయాలకు రూ.19.20 కోట్లు నిధులు సమకూర్చారు. ఇందులో 91 సచివాలయాల పరిధిలో 468 పనులు గుర్తించారు. వాటిలో 332 పనులు ఎన్నికల నాటికి పూర్తి చేశారు. మరో 135 పనులు నిధుల కొరతతో ఆపారు. చివరగా జగన్‌పై కక్షతో ఆ పనులన్నీ రద్దు చేశారు.

మౌలిక సౌకర్యాలకే పెద్దపీట

గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా చేపట్టిన పనుల్లో మౌలిక సౌకర్యాలకే పెద్దపీట వేశారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సమస్యకు అధిక ప్రాధాన్యతను ఇచ్చారు. పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ఆధ్వర్యంలో చేపట్టారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉండే పనులకు నిధులు సమకూర్చితే ప్రయోజనం జరిగేది. ఆ పనులు రద్దు చేయడంతో రూ.కోట్లలో నిధులు వెనక్కివెళ్లాయి.

పనులు రద్దయ్యాయి

గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు దాదాపు రద్దయ్యాయి. దానికి సంబంధించిన మార్గదర్శకాలు కార్యాలయాలకు చేరాల్సి ఉందని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్‌డీఈ శ్రీనివాసులు, పీఆర్‌డీఈ సుధాకర్‌నాయక్ పేర్కొన్నారు. ప్రస్తుతం చేసిన కొన్ని పనులకు నిధులు విడుదల కావాల్సి ఉంది.

గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా మంజూరైన పనులు

మండలం	సచివాలయాలు	మొత్తం పనులు	పూర్తయిన పనులు	ప్రారంభం కాని పనులు
బొమ్మనహాళ్	15	83	77	06
డి హీరేహాళ్	09	88	49	38
గుమ్మఘట్ట	4	83	46	37
కణేకల్లు	21	97	76	21
రాయదుర్గం	14	61	41	20
రాయదుర్గం అర్బన్	18	56	43	13
మొత్తం	91	468	332	135

పనులు రద్దు చేయడం దారుణం



గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా మంజూరైన పనులన్నీ రద్దుచేసేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైందికాదు. ఆ పనులు కేవలం గ్రామాల్లో మౌళిక సౌకర్యాల కల్పనకే పెద్దపీట వేశారు. ప్రతి సచివాలయం పరిధిలోనూ జగన్ సర్కార్ రూ.20 లక్షల నిధులు కేటాయించారు. 80 శాతం పనులు పూర్తయ్యాయి. మరో 20 శాతం చేసి ఉంటే వంద శాతం పూర్తయ్యేది. ఆ లోపు తీసుకున్న ఈ నిర్ణయం అభివృద్ధికి చెంపపెట్టుగా మారింది.

– జీ రామాంజనేయులు, సర్పంచ్, బీఎస్‌హళ్లి

రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలి

కూడేరు: మండలానికి రెగ్యులర్ తహసీల్దార్ లేక రైతులు, విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణమూర్తి అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న మండలానికి రెగ్యులర్ తహసీల్దార్ లేక పోవడం దారుణమన్నారు. ఉరవకొండ తహసీల్దార్ మహబూబ్ బాషాకి ఇన్‌చార్జ్‌గా నియమించడంతో ఆయన ఎప్పుడు వస్తారో తెలియక రైతులు, ప్రజలు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉందన్నారు. మండల కన్వీనర్ కరీం సాబ్, సహాయ కార్యదర్శి వెంకటేశులు, నాయకులు మల్లికార్జున, వీరప్ప, సూరి తదితరులు పాల్గొన్నారు.

నేటిలోపు సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

రాయదుర్గంటౌన్: మున్సిపాలిటీలోని సచివాలయాల పరిధిలో బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, బ్రాహ్మణ కార్పొరేషన్ల ద్వారా నిరుద్యోగ, యువతీ యువకులు స్వయం ఉపాధి పొందేందుకు సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. దరఖాస్తులను ఈనెల 7 సాయంత్రం లోపు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మున్సిపాలిటీకి మొత్తం 66 యూనిట్లు మంజూరయ్యాయి. బీసీ కార్పొరేషన్ కింద 48 యూనిట్లు, జనరల్ మెడికల్ షాపుకు 1, ఈబీసీ కార్పొరేషన్ కింద 4 యూనిట్లు, జనరల్ మెడికల్ షాపుకు 1, కమ్మ కార్పొరేషన్ కింద 2 యూనిట్లు, జనరిక్ మెడికల్ షాపుకు 1, కాపు కార్పొరేషన్ కింద 8, రెడ్డి కార్పొరేషన్ కింద 2, ఆర్యవైశ్య కార్పొరేషన్ కింద 2, బ్రాహ్మణ కార్పొరేషన్ కింద 1 యూనిట్ మంజూరైనట్లు చెప్పారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు చేసుకోండి

కంబదూరు: కాపు,బీసీ,ఈబీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని మండల పరిషత్ ఏవో తిప్పయ్య గురువారం తెలిపారు. మండలానికి కాపు కార్పొరేషన్ –10, బీసీ కార్పొరేషన్ – 39, ఈబీసీ కార్పొరేషన్ కింద – 3 యూనిట్లు చెప్పున మంజూరైనట్లు తెలిపారు.

క్లుప్తంగా

ముమ్మరంగా ఆస్తి, నీటి పన్నుల వసూళ్లు


పన్ను వసూళ్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి

రాయదుర్గంటౌన్: పురపాలక సంఘంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్ను వసూళ్లను మున్సిపల్ రెవెన్యూ సిబ్బంది ముమ్మరం చేశారు. సచివాలయ సిబ్బంది, బిల్ కలెక్టర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, నీటి సరఫరా విభాగం సిబ్బంది ప్రత్యేక టీములతో వసూలు చేస్తున్నారు. పన్ను చెల్లింపు శిబిరాలు, క్షేత్రస్థాయిలో పన్నుల వసూళ్లను గురువారం మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఆర్‌ఐ సత్యనారాయణ పరిశీలించారు. పురపాలక సంఘంలో ఆస్తి పన్ను డిమాండ్ రూ.5.27 కోట్లకుగాను ఇప్పటి దాకా రూ.2.94 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. నీటి పన్ను డిమాండ్ రూ.3.61 కోట్లకు గాను రూ.1.06 కోట్లు వసూలు చేసినట్లు తెలిపారు.

అరబిక్ కళాశాలలో క్రీడాపోటీలు


క్రీడల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని జామియా మహమ్మదీయ అరబిక్ కళాశాలలో గురువారం ఉత్సాహంగా క్రీడాపోటీలు జరిగాయి. దాదాపు 20 విభాగాల్లో సీనియర్స్, జూనియర్ విభాగాల్లో పోటీలు జరిపారు. క్రికెట్, వాలీబాల్, బాస్కెట్ బాల్, కబడ్డీ, రన్నింగ్, ఖోఖో పోటీలు నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ చేతులమీదుగా బహుమతులు అందించారు. కళాశాల అధ్యక్షుడు అబ్దుల్ బాసిత్, కార్యదర్శి సయ్యద్ అమీర్ హమ్జ, ప్రిన్సిపాల్ అష్రఫ్‌ఫైజీ, వైస్ ప్రిన్సిపాల్ అబ్దుల్ అజీమ్, ప్రభుత్వ ఖాజీ అతావుర్ రెహిమాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లింగ వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం


అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

బొమ్మనహాళ్: లింగ వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమిద్దామని శ్రీధరఘట్ట పీహెచ్‌సీ వైద్యాధికారులు గీతాభార్గవి, కుమారరాజా తెలిపారు. గురువారం మండలంలోని శ్రీధరఘట్ట హైస్కూల్‌లో లింగ వివక్షతపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ ఆడపిల్లలు చదువుకోవడం వల్ల ఆర్థిక స్వావలంబన సాధించి, ఉజ్వల భవిష్యత్ సాకారమవుతుందన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోండి


మాట్లాడుతున్న ఎంపీపీ కరణం పుష్పావతి

విడపనకల్లు: రానున్న వేసవిలో గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కరణం పుష్పావతి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కరణం పుష్పావతి అధ్యక్షతన జరిగింది. జెడ్పీటీసీ హనుమంతు , ఎంపీడీఓ షకీలాబేగం, వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీలు మాట్లాడుతూ విద్యా, వైద్య, ఆరోగ్య, వ్యవసాయ, రెవెన్యూ, విద్యుత్, ఉపాధిహామీ తదితర శాఖల పనులపై చర్చించారు. గత సమావేశంలో అధికారుల దృష్టికి తెచ్చిన సమస్యలను ఎంత వరకు పరిష్కరించారో అడిగి తెలుసుకున్నారు.

'స్టెమీ' సేవలను సద్వినియోగం చేసుకోండి


స్టెమీ సేవలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నిరీషా

కణేకల్లు: కణేకల్లు సీహెచ్‌సీలో నిర్వహించే 'స్టెమీ' సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీహెచ్‌సీ ఇన్‌చార్జ్ డాక్టర్ నిరీషా తెలిపారు. గురువారం స్థానిక సీహెచ్‌సీలో స్టెమీ ప్రోగ్రాంపై అవగాహన కల్పించారు. వైద్యాధికారిణి మాట్లాడుతూ గుండెనొప్పి వచ్చిన వారిని గంట సమయం లోపు సీహెచ్‌సీకి తీసుకొస్తే ఈసీజీ పరీక్షలు నిర్వహించి, రూ.42 వేలు విలువ చేసే టెనెక్టప్లేస్ ఇంజెక్షన్ వేస్తామన్నారు. రోగి ఆరోగ్యం 48 గంటల వరకు నిలకడగా ఉంటుందన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని పెద్దాసుపత్రికెళ్లి రెఫర్ చేస్తామని, అక్కడ శస్త్రచికిత్స చేయించుకోవచ్చన్నారు. టెనెక్టప్లేస్ ఇంజెక్షన్ ఖరీదైందన్నారు. ఈ ఇంజెక్షన్ రక్తనాళాల్లో ఏర్పడిన బ్లడ్‌క్లాట్స్‌ను కరిగించి ఆరోగ్యాన్ని క్షేమంగా ఉంచుతుందన్నారు. ఇప్పటి వరకు 14 మందికి ఈ ఇంజెక్షన్ వేసి ప్రాణాలను కాపాడినట్లు తెలిపారు.

రాఘవేంద్రస్వామి మఠంలో విశేష పూజలు


మధ్వాచార్యుల పల్లకీ ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: స్థానిక ఇంద్రానగర్‌లోని రాఘవేంద్ర స్వామి మఠంలో మాఘమాసం శుద్ధ నవమి సందర్భంగా గురువారం విశేష పూజలు, పల్లకీ ఉత్సవం నిర్వహించారు. ఉదయం రాఘవేంద్రస్వామి మూల విరాట్‌కు విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం జగద్గురు మధ్వాచార్యుల చిత్రపటాన్ని పల్లకీలో ఉంచి పల్లకీ ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారికి పూజలు జరిపించారు.

వజ్రకరూరులో పొట్టు వామి దగ్ధం


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

వజ్రకరూరు: మండల కేంద్రంలో పెద్దొడ్డి వెంకటరాముడు అనే రైతుకు చెందిన పొట్టువాముకు గుర్తు తెలియని వ్యక్తులు గురువారం తెల్లవారుజామున నిప్పు పెట్టారు. దీంతో వామి పూర్తిగా కాలిపోయింది. మంటలు ఎగిసిపడడంతో సమీపంలోని వారు గమనించి, బాధిత రైతుకు సమాచారం అందించారు. అనంతరం గుంతకల్లుకు చెందిన అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలు అదుపు చేశారు. రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్‌ఓ మారెన్నతో కలిసి సర్పంచ్ మోనాలిసా, వార్డు సభ్యులు మల్లికార్జునరెడ్డి పరిశీలించారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య


వన్నూరుస్వామి (ఫైల్)

విడపనకల్లు: హావళిగి గ్రామానికి చెందిన తురాయి వన్నూర్‌స్వామి (27) పురుగుల మందు తాగి గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన మేరకు.. వన్నూర్‌స్వామి రెండేళ్లుగా 10 ఎకరాల్లో మిరప సాగు చేస్తున్నాడు. మిరప సాగుకోసం పెట్టుబడికి బయటి వ్యక్తులతో రూ.10 లక్షలు వరకు అప్పు తెచ్చాడు. మిరప పంట దిగుబడి రాక, మార్కెట్లో ధర లేక అప్పు తీర్చే మార్గం లేక తీవ్ర మనోవేదన పడుతుండేవాడు. మృతుడి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కూడేరు: మండలంలోని అరవకూరు సమీపంలో అనంతపురం- బళ్లారి ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదానికి గురైన గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కొకుంట్లకు చెందిన పెద్ద వన్నూరు స్వామి ద్విచక్ర వాహనంపై అనంతపురం వెళ్తుంటే రహదారి పక్కన నడిచి వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తి అతన్ని లిఫ్ట్ అడిగి ఎక్కాడు. కొంత దూరం వెళ్లాక ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడ్డారు. గాయపడిన గుర్తు తెలియని వ్యక్తిని అనంతపురంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ రాజు తెలిపారు. అతని మృతదేహం మార్చురీలో ఉంచారు. అతని ఫొటోని ఎవరైనా చూసి గుర్తిస్తే సమాచారాన్ని సెల్: 9440796814లో ఇవ్వాలని సీఐ తెలిపారు.

పట్టాభిరాముని బ్రహ్మోత్సవాలు ప్రారంభం


అలంకరణలో సీతారాములు


గోపూజ చేస్తున్న వేద పండితులు

కళ్యాణదుర్గం: పట్టణంలోని కోటవీధిలోని పట్టాభి రామ స్వామి ఆలయంలో ఈనెల 6 నుంచి 14వ తేదీ వరకు జరగనున్న పట్టాభి రాముడి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం గోవు పూజ, పట్టాభి రామస్వామి మూల విగ్రహాలకు పంచామృతాభిషేకం, అలంకరణ, మహా మంగళహారతి చేశారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు పుణ్యాహవచనం, వాస్తు అంగహోమం, ధ్వజారోహణం, గ్రామ బలి, ఆ స్థాన మంటప సేవలు జరుగుతాయి. శనివారం కుంభ పూజ, నిత్య హోమం, గ్రామబలి, ఆ స్థాన మంటప సేవలు జరుగుతాయి. ఆదివారం కుంభ పూజ, నిత్య హోమం, గ్రామబలి, ఆ స్థాన మంటప సేవ ఉంటుంది. సోమవారం ఉదయం 8 గంటల నుంచి కుంభపూజ, నిత్య హోమం, గ్రామబలి, ఆస్థాన మండప సేవ ఉంటుంది. 10 గంటలకు పద్మశాలి కులబాంధువులతో సీతారాముల కల్యాణోత్సవం, సాయంత్రం 5 గంటల నుంచి పట్టణ పురవీధుల గుండా గరుడోత్సవం జరుగుతుంది. మంగళవారం ఉదయం 8 గంటలకు కుంభ పూజ, నిత్యహోమం, గ్రామబలి, ఆస్థాన మంటప సేవ, ఉత్సవ విగ్రహాలకు తిరుమంజనము జరుగుతుంది. బుధవారం ఉదయం 7 గంటలకు కుంభపూజ, నిత్యహోమం, గ్రామబలి, ఆస్థాన మంటపం సేవ, తాలూకా బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మడుగుతేరు, బ్రహ్మరథోత్సవం జరుగుతుంది. సాయంత్రం 4 గంటలకు ధూలోత్సవం, సాయంత్రం 7 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. గురువారం సాయంత్రం 6 గంటలకు ఉయ్యాలోత్సవం, అనంతరం బ్రహ్మశ్రీ గరికపాటి నరసింహారావు కుమారుడు ప్రొఫెసర్ గరికపాటి గురజాడ చే ప్రవచన కార్యక్రమం ఉంటుంది. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి కుంభపూజ, నిత్యహోమం, మహాపూర్ణాహుతి, కంకణ విసర్జన, ద్వాదశి తిరువారాధన, చక్రస్నానం జరుగుతుంది. సాయంత్రం 7 గంటలకు శయనోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

సంక్షిప్త సమాచారం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కంబదూరు: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి అశోక్ సూచించారు. గురువారం మండలంలోని మర్రిమాకులపల్లి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 104 వాహనంలో 52 మంది గర్భిణులు,బాలింతలు,షుగర్,బీపీ పరీక్షలు చేశారు. వృద్ధులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందించారు.

ప్రమాదాల నివారణకు కృషి చేద్దాం

బొమ్మనహాళ్: ప్రమాదాలను అరికట్టడానికి అందరూ కృషి చేయాలని ఎస్ఐ నబీరసూల్ అన్నారు. గురువారం ఉద్దేహాళ్ గ్రామ శివారులో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనాలను సీజ్ చేస్తున్నామన్నారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలన్నారు.

నేటి నుంచి వన్నూరుస్వామి ఉత్సవాలు

కణేకల్లు: మండలంలోని జక్కలవడికిలో వన్నూరుస్వామి ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. శుక్రవారం వేకువ జామున షంషీర్‌ను గుర్రంపై ఊరేగించనున్నారు. శనివారం పానకాల పండుగ జరగనుంది.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

గుమ్మఘట్ట: మండల కేంద్రంలోని వ్యవసాయ గోడౌన్‌లో కందుల కొనుగోలు కేంద్రాన్ని గురువారం కార్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు ఏఓ నిర్మల్‌కుమార్ తెలిపారు. 36 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వాసవీమాత విగ్రహ ప్రతిష్ఠ


ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడలో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకాపరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు రెండో రోజు గురువారం జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి పూజలు ప్రారంభించారు. వేద పారాయణం, యోగశాల ప్రవేశం, కలశస్థాపన, గణపతి, నవగ్రహ, మృత్యుంజయ, ఆయుష్యహోమం, మహాస్నపనం, జలధివాసం, క్షీరాధివాసం, విగ్రహాలను గ్రామ ప్రదక్షిణ చేయించి పూజలు జరిపించారు. శుక్రవారం తెల్లవారుజామున వాసవీమాత, గణపతి, సుబ్రహ్మణేశ్వర స్వామి, నాగేశ్వర విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠాపన జరుగుతుందని ఆర్యవైశ్య సంఘం నాయకులు ముద్దు మల్లికార్జున శెట్టి, ఆర్వేటి లేపాక్షి శెట్టిలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కణేకల్లు: కణేకల్లు శివారులో మారెంపల్లిక్రాస్ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బ్రహ్మసముద్రానికి చెందిన పెన్నయ్య అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కణేకల్లు నుంచి ఆటోలో సొంతూరుకు వెళ్తుండగా బళ్లారి నుంచి కణేకల్లుకు వస్తున్న ఆర్టీసీ బస్సు.. ఆటోలో చివరన కూర్చున్న పెన్నయ్యకు తగిలింది. దీంతో ఒక్కసారిగా పెన్నయ్య కింద పడ్డాడు. గాయపడిన అతన్ని మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు.

ఈడిగ మద్యం షాపు దరఖాస్తులకు గడువు పెంపు

కంబదూరు: ప్రభుత్వం ఈడిగ కులస్తులకు కేటాయించిన మద్యం షాపునకు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 8 వరకు గడువు పొడిగించినట్లు కంబదూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సునీల్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు కంబదూరు ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

కల్వర్టులోకి ఒరిగిపోయిన కంకర ట్రాక్టర్

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కేబీ ప్యాలెస్ రోడ్డులోని చేపల మార్కెట్ వెళ్లే వీధిలో గురువారం కంకర ట్రాక్టర్ కల్వర్టులోకి ఒరిగిపోయింది. ఆ సమయంలో పక్కన ఎవరూ లేకపోవంతో ప్రమాదం తప్పింది. కల్వర్టు సగభాగం కుప్పకూలడంతో ట్రాక్టర్ టైరు దిగబడి ట్రాలీ డ్రైనేజీలోకి కూరుకుపోయింది. జేసీబీతో ట్రాక్టర్‌ను వెలికి తీశారు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ టీచర్ మృతి

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని విట్లంపల్లి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త జయమ్మ అనారోగ్యంతో గురువారం మృతిచెందింది. సూపర్‌వైజర్ ఓబులమ్మ, అంగన్‌వాడీ సిబ్బంది జయమ్మ మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. జయమ్మ కుటుంబ సభ్యులకు రూ.15వేలు అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సెక్టార్ లీడర్స్ తిప్పీరమ్మ, వన్నూరమ్మ, అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో నూతనోత్సాహం

- మండల అధ్యక్షుల నియామకం
- అన్ని వర్గాలకూ సముచిత స్థానం



రాయదుర్గం: వైఎస్సార్‌సీపీలో నూతనోత్సాహం వచ్చింది. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అన్ని మండలాల అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఇప్పటికే వివిధ విభాగాలకు నియోజకవర్గ అధ్యక్షులను నియమించారు. తాజాగా పార్టీలో కీలకంగా చెప్పుకునే మండల కన్వీనర్ల ఎంపికలోనూ సామాజిక న్యాయం పాటించారు. బీసీ కులాలకు అగ్రతాంబూలం ఇచ్చారు. ఇప్పటి దాక యాదవులకు ఏ పార్టీ ఇవ్వనంతగా రెండు మండలాల్లో కన్వీనర్లుగా బాధ్యతలు అప్పగించారు.

రాయదుర్గం నూతన కన్వీనర్లు వీరే..

రాయదుర్గం పట్టణ కన్వీనర్‌గా మేకల శ్రీనివాసులు, రాయదుర్గం మండల కన్వీనర్‌గా జీ రామాంజినేయులు, గుమ్మఘట్ట మండల కన్వీనర్‌గా గౌని లక్ష్మీకాంతారెడ్డి, కణేకల్లు మండల కన్వీనర్‌గా బ్రహ్మానందారెడ్డి, బొమ్మనహాళ్ మండల కన్వీనర్‌గా ఆర్. రామాంజనేయులు, డి హీరేహాళ్ మండల కన్వీనర్‌గా పీ రవీంద్రనాథ్‌రెడ్డిని నియమించారు. అన్ని మండలాలకు సమర్థులను ఎంపిక చేయడంతో పార్టీ నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్సాహం నెలకొంది.

అన్ని కులాలకూ సమ న్యాయం

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలో ఆయా మండలాల అధ్యక్షులను నియమిస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణ, మండల పార్టీ అధ్యక్షులను ఏకగ్రీవంగా నియమించారు. ఈ మేరకు గురువారం పార్టీ అధిష్టానం నుంచి జాబితా విడుదలైంది. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడిగా ఐ. సుధీర్, కళ్యాణదుర్గం మండలం అధ్యక్షుడిగా బోయ సూర్య నారాయణ, కంబదూరు పట్టణ అధ్యక్షుడిగా వడ్డే వెంకటప్ప, కంబదూరు రూరల్ అధ్యక్షుడిగా జి.హనుమంతరాయుడు, బ్రహ్మసముద్రం అధ్యక్షుడిగా పి.చంద్రశేఖర్, కుందుర్పి అధ్యక్షుడిగా కె.హనుమంతరాయుడు, శెట్టూరు అధ్యక్షుడిగా ఎంఎస్ హనుమంతరాయుడును ఎంపిక చేశారు.

ఉరవకొండ మండల అధ్యక్షుల నియామకం

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉరవకొండ నియోజకవర్గ మండలాల అధ్యక్షులను నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ ఉరవకొండ పట్టణ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన సీనియర్ నాయకుడు ఈడిగ ప్రసాద్, ఉరవకొండ రూరల్ అధ్యక్షుడిగా రాయంపల్లికి చెందిన సీనియర్ నాయకుడు ఎర్రిస్వామిరెడ్డి, బెళుగుప్ప మండల అధ్యక్షుడిగా ఎస్.చిన్నమచ్చన్న, కూడేరు మండల అధ్యక్షుడిగా బైరెడ్డి రామచంద్రారెడ్డి, వజ్రకరూరు మండల అధ్యక్షుడిగా సోమశేఖర్‌రెడ్డి, విడపనకల్లు మండల అధ్యక్షుడిగా కురుబ రమేష్ నియమితులయ్యారు.